TGTEL/26/A6780
# స్పందన
తెలుగు దినపత్రిక
సంపుటి :01 | సంచిక :32 | పేజీలు 8 | వెల : 5
గురువారం 22 అక్టోబర్ 2026

## విలేకరులు కావలెను
జర్నలిస్టులే యాజమాన్యంగా నడపబడుతూ ప్రజా గొంతుకై అనతికాలంలోనే ప్రభంజనం సృష్టిస్తున్న స్పందన దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.ఆసక్తి ఉన్న వార
ఈ క్రింది నెంబర్లలలో సంప్రదించండి
9440657806,9440697806




## తెలంగాణలో మద్యం అమ్మకాల జోరు..

**19 రోజుల్లోనే రూ.2,054 కోట్లు**

- గత ఏడాదితో పోలిస్తే 37.02 శాతం వృద్ధి
- బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా పెరుగుదల
- 30.37 లక్షల కేసులకు చేరిన బీర్ల విక్రయాలు
- IMFL అమ్మకాలు 18.38 లక్షల కేసులకు పెరుగుదల
- అక్టోబర్ 19న రూ.303.40 కోట్ల విక్రయాలు



## అమరుల త్యాగాలతోనే
# రాష్ట్రంలో శాంతిభద్రతలు

- పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యం
- కొత్త తరహా నేరాలను ఎదుర్కొనేందుకు నైపుణ్యాలు పెంచుకోవాలి
- నిజాయతీగా సేవ చేయడమే అమరులకు నిజమైన నివాళి
- డీజీపీ ఆనంద్

**హైదరాబాద్, అక్టోబర్ 21:** ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని డిజిపి సి.వి. ఆనంద్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తీవ్రవాదం, నక్సలిజం, మావోయిజం, ఇతర అసాంఘిక శక్తులను ఎదుర్కొనే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులర్పించి,

మిగతా 2వ పేజీలో..



## మైసూరు దసరా ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి

- కర్నాటక సీఎం డీకే ఆహ్వానం
- చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి

2




## పోలీస్ అమరుల కుటుంబాలకు అండ

- పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యం
- 2028లోగా శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తాం
- ఎన్నడూ లేని విధంగా 112మంది డీఎస్పీలను నియమించాం
- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో సీఎం రేవంత్




## బలపరీక్ష పెడితే తృణమూల్ ఎమ్మెల్యేల మద్దతూ మాకే..

**బెంగాల్ సీఎం సువేందు సంచలన వ్యాఖ్యలు**

- బలపరీక్ష పెడితే తమకు 275 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తుందన్న సువేందు అధికారి
- టీఎంసీ నుంచి గెలిచిన 64 మంది ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతిస్తారని ధీమా
- ప్రజలు ఎన్నుకున్న 'సనాతన' ప్రభుత్వం తమదని వ్యాఖ్య
- భవానీపూర్‌లో మాజీ సీఎం మమతపై తన గెలుపును ప్రస్తావించిన అధికారి
- 49 ఏళ్ల వామపక్ష, టీఎంసీ పాలన సమస్యలను పరిష్కరిస్తున్నామన్న సీఎం

## ముగిసిన దసరా సెలవులు
# హైదరాబాద్ బాట పట్టిన జనం

- పంతంగి, రాయగిరి టోల్‌ప్లాజాల వద్ద భారీగా వాహనాల రద్దీ
- చౌటుప్పల్ సమీపంలో 2–3 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- గురువారం నుంచి పునఃప్రారంభం కానున్న విద్యాసంస్థలు, కార్యాలయాలు

2






## ఎస్‌బీఐ ఖాతాలపై సైబర్ దాడి

- డార్క్‌వెబ్‌లోకి 3,897 మంది కస్టమర్ల వివరాలు
- ధ్రువీకరించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- దర్యాప్తునకు థర్డ్ పార్టీ సైబర్ ఏజెన్సీ నియామకం

**హైదరాబాద్, అక్టోబర్ 21 :** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) సైబర్ దాడికి గురైంది. హ్యాకర్ల దాడి కారణంగా 3,897 మంది వినియోగదారులకు సంబంధించిన వ్యక్తిగత డేటా బహిర్గతమై డార్క్ వెబ్‌లోకి వెళ్లినట్లు ఎస్‌బీఐ అధికారికంగా ధ్రువీకరించింది. ఈ డేటా లీక్‌లో కస్టమర్ల పేర్లు, లింగం,

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణకు బీసీ సీఎం..
# కానీ ఇప్పుడే కాదు

- బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్
- రేవంత్ రెడ్డి పాలన 2039 వరకు కొనసాగుతుందని విశ్వాసం
- కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణకు బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య




# ప్రతీ నీటి చుక్కను ఒడిసిపట్టాలి

- రామప్ప చెరువులో 29 అడుగుల నిల్వ
- ఉపాధి హామీ పనులతో నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలి
- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**ములుగు, అక్టోబర్ 21 :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఆరు

మిగతా 2వ పేజీలో..






# పోలీస్ అమరుల కుటుంబాలకు అండ

**హైదరాబాద్, అక్టోబర్ 21 :**

ఈ రోజు మనందరికీ ఎంతో భావోద్వేగమైన రోజు.. సమాజం కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరులను స్మరించుకునే రోజు అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. అమరులకు నివాళులర్పిస్తూ అమరుల కుటుంబం ఒంటరి కాదు.. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణలో వారి త్యాగాలను మరువలేమన్నారు. ఈ ఏడాది 155మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా గోషామహల్ పోలీస్ స్టేడియంలో బుధవారం జరిగిన పోలీస్ స్మారక పరేడ్ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్‌తో కలిసి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతి భద్రతల పరిరక్షణ ఎంతో ముఖ్యమని, అందుకే పోలీస్ శాఖకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. 2028లోగా పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 112మంది డీఎస్పీలను నియమించామని, ట్రాన్స్‌జెండర్స్‌ను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మ గౌరవాన్ని పెంచామని తెలిపారు. గతంలో విధి నిర్వహణలో వీరమరణం పొందిన కానిస్టేబుళ్లకు రూ.40 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఉంటే దానిని ఏకంగా రూ.కోటికి పెంచామని, హెడ్ కానిస్టేబుళ్ళు, ఏఎస్ఐ లకు గతంలో రూ.45 లక్షలుగా ఉన్న పరిహారాన్ని రూ.కోటికి పెంచామని, ఎస్ఐలకు రూ.45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 లక్షలు ఉంటే దీనిని రూ.1.25 కోట్లుకు పెంచామని, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారులకు రూ.50 లక్షలు ఉంటే తాము రూ.1.50 కోట్లకు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.కోటి పరిహారం ఉంటే దానిని రూ.2 కోట్లకు పెంచామని వివరించారు. ఇది కేవలం ఆర్థిక సహాయం కాదు.. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం అని అన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించి హోమ్ గార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు వారి పిల్లలకు ఇందులో అవకాశం కల్పించామన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నామని, ఈ ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నానని చెప్పారు.

**కాలంతోపాటు నేర స్వభావం మారుతోంది**

కాలంతోపాటు నేర స్వభావం కూడా మారుతోందని, కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖను ఆధునీకరించాలని నిర్ణయించామని సీఎం చెప్పారు. ఆధునిక సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించామంటూ సాంకేతికత ఎంత పెరిగినా పోలీసుల మానవీయ దృక్పథం మారకూడదని స్పష్టం చేశారు. డ్రగ్స్, గంజాయి వ్యాప్తి అత్యంత ప్రమాదకరమంటూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాలన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును, డీజీపీని అభినందిస్తున్నానన్నారు. కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపేందుకు టీజీ సేఫ్‌ను తీసుకొచ్చామని, షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మహిళల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

**మహిళలకు అండగా ఉండేందుకు 'స్టాండ్ విత్ హర్'**

మహిళలకు అండగా నిలిచే సామాజిక బాధ్యతను పెంచడానికి స్టాండ్ విత్ హర్ కార్యక్రమాన్ని ఈ ఏడాది మార్చిలో ప్రారంభించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళలు, పిల్లలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ రక్షణ అందించడానికి ఏప్రిల్‌లో స్పందన తక్షణ రక్షణ బృందాలను ప్రారంభించామన్నారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదన్నారు. మహిళల భద్రత కేవలం పోలీసు శాఖ బాధ్యతే□ కాదు.. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. చివరగా పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా ఒక మాట చెప్పాలనుకుంటున్నా.. మీరు కోల్పోయిన వ్యక్తిని ఎవరూ తిరిగి తీసుకురాలేరు.. మీ కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ పూర్తిగా భర్తీ చేయలేరు.. కానీ మీ బాధలో మీరు ఒంటరివారు కాదు.. మీకు ప్రభుత్వం అండగా ఉంటుంది.. పోలీసు శాఖ అండగా ఉంటుంది.. తెలంగాణ సమాజం అండగా ఉంటుంది.. అని హామీ ఇచ్చారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి అధికారి, ప్రతి సిబ్బందికి ఒక మాట చెప్పాలనుకుంటున్నా.. మీ క్రమశిక్షణే మీ బలం.. మీ నిజాయతీయే మీ గౌరవం.. ప్రజలకు మీరు అందించే భరోసాయే మీకు లభించే గొప్ప గుర్తింపు.. ప్రజల భద్రతకు మీరు అండగా నిలవండి.. మీ సంక్షేమానికి, మీ కుటుంబాల భవిష్యత్తుకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది.. అమరుల త్యాగాలను గౌరవిద్దాం.. వారి ఆశయాలను కొనసాగిద్దాం. శాంతియుతమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించుకుందాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.




# మైసూరు దసరా ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి

**మైసూరు, అక్టోబర్ 21 :**

చారిత్రక మైసూరు దసరా ఉత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఘట్టం జంబూ సవారిలో అందంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. కన్నడ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళాకారులు, సంగీత బృందాలు, నృత్య బృందాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఈ ఊరేగింపులో పాల్గొన్నాయి. రంగురంగుల వస్త్రధారణలు, సంప్రదాయ నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు, అలంకరించిన ఏనుగులు ఈ వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి. కర్నాటక నాడ హబ్బ (రాష్ట్ర పండుగ) ఉత్సవాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, కళలు, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయి. కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తోపాటు ఎంతోమంది దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులతో కలిసి ఉత్సవాలను వీక్షించారు. మైసూరు రాజభవనం ముందు నిర్వహించిన ఈ దసరా వేడుకల్లో పాల్గొనడానికి ముందు ముఖ్యమంత్రి మైసూరు ప్రజల ఆరాధ్య దైవమైన చాముండేశ్వరి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని ప్రార్థించారు.

## ముగిసిన దసరా సెలవులు హైదరాబాద్ బాట పట్టిన జనం

**హైదరాబాద్, అక్టోబరు 21:**

దసరా పండుగ సెలవులు ముగియడంతో నగరవాసులు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. పల్లెల్లో పండుగ వేడుకలను ముగించుకుని నగరబాట పట్టడంతో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. గురువారం నుంచి పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు తిరిగి ప్రారంభం కానుండటంతో పెద్ద సంఖ్యలో ప్రజలు నగరానికి తరలివస్తున్నారు. ఫలితంగా శివారు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**వాహనాలతో కిక్కిరిసిన జాతీయ రహదారులు**

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్65), వరంగల్-హైదరాబాద్ మార్గం (ఎన్‌హెచ్163)పై వాహనాలు బారులు తీరాయి. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు భారీగా తరలిరావడంతో టోల్‌ప్లాజాల వద్ద రద్దీ తీవ్రరూపం దాల్చింది. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా, బీబీనగర్ సమీపంలోని రాయగిరి, గూడూరు టోల్‌గేట్ల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోయాయి. చౌటుప్పల్ పరిసరాల్లో సుమారు రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నెమ్మదిగా కదలడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

**ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు**

వాహనాల రద్దీ పెరగడంతో పోలీసు, రవాణా శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కీలక కూడళ్ల వద్ద ప్రత్యేక బృందాలను మోహరించారు. చౌటుప్పల్ వద్ద రద్దీని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లోకి వాహనాలను మళ్లిస్తున్నారు. వరంగల్, విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) మీదుగా సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. టోల్‌ప్లాజాల వద్ద వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు ఫాస్ట్‌ట్యాగ్ స్కానర్లను ముందుగానే తనిఖీ చేశారు. అదనపు సిబ్బందితో హ్యాండ్‌హెల్డ్ యంత్రాల ద్వారా టోల్ రుసుము వసూళ్లను వేగవంతం చేస్తున్నారు. అంబులెన్సులు, ఇతర అత్యవసర వాహనాల కోసం ప్రత్యేక లేన్లను ఏర్పాటు చేశారు.

**బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలోనూ రద్దీ**

మరోవైపు ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లతో పాటు సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు సైతం ప్రయాణికులతో నిండిపోయి నగరానికి చేరుకుంటున్నాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా వాహనాల రాక మరింత పెరిగే అవకాశం ఉండటంతో పోలీసులు ప్రధాన రహదారులపై గస్తీని ముమ్మరం చేశారు.





# వైభవంగా దుర్గామాత నిమజ్జనాలు

**హైదరాబాద్, అక్టోబర్ 21:**

నగరంలో దుర్గామాత శరన్నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా అమ్మవారి విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కోలాహలంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రధాన మార్గాల్లో భారీ ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉండటంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఆంక్షలు విధించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పలు మార్గాల్లో ట్రాఫిక్ ను దారి మళ్లిస్తున్నారు.

**ముఖ్యమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు**

పీపుల్స్ ప్లాజా, గార్డెన్ పాయింట్, జలవిహార్, సంజీవయ్య పార్క్ జేబీ పాండ్స్ వద్ద నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు. ఖైరతాబాద్ రూట్: పంజాగుట్ట, రాజ్భవన్ వైపు నుంచి ఖైరతాబాద్ ఫ్లైఓవర్కు వచ్చే వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లిస్తున్నారు. వి.వి విగ్రహం వద్ద ట్రాఫిక్ ను నిరంకారి జంక్షన్ వైపు పంపిస్తున్నారు. ఇక్బాల్ మినార్ వైపు సాధారణ వాహనాలకు ప్రవేశం లేదు. కేవలం నిమజ్జనానికి వచ్చే వాహనాలకు మాత్రమే అనుమతిస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్ సైఫాబాద్ వద్ద వాహనాలను రవీంద్ర భారతి, మాసాబ్యాంక్ వైపు మళ్లిస్తు న్నారు. ఖైరతాబాద్ బడా గణేశ్ లేన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వాహనాలు నిలిపివేశారు. అప్పర్ ట్యాంక్ బండ్ నుంచి వచ్చే వాహనాలను లిబర్టీ వైపు మళ్లిస్తుండగా లిబర్టీ నుంచి సెక్రటేరియట్ జంక్షన్ వైపు సాధారణ వాహనాలకు అనుమతి లేదు. నల్లగుట్ట బ్రిడ్జ్, పీవీ మార్గ్ నుంచి వచ్చే ట్రాఫిక్ను మినిస్టర్ రోడ్డు వైపు మళ్లిస్తున్నారు. రాణిగంజ్, మినిస్టర్ రోడ్డు నుంచి నెక్లెస్ రోడ్డు వైపు వెళ్లే వారికి ప్రత్యామ్నాయ మార్గాలు సూచించారు.

**ప్రయాణికులకు పోలీసుల విజ్ఞప్తి**

నిమజ్జన ప్రాంతాల పరిసరాల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం. ఉన్నందున, నగర ప్రజలు, వాహదారులు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని తమ ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. అవసరమైన వారు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవా లని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించి నిబంధనలు పాటించాలని కోరారు.



## తెలంగాణలో మద్యం అమ్మకాల జోరు.. 19 రోజుల్లోనే రూ.2,054 కోట్లు

తెలంగాణలో దసరా పండుగ సీజన్‌లో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే విక్రయాలు 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడించాయి. పండుగ వేళ బీర్లకు డిమాండ్ గణనీయంగా పెరగడం ఈసారి ప్రత్యేకంగా కనిపించింది. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (IMFL)తో పోలిస్తే బీర్ల విక్రయాలు వేగంగా పెరిగాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, ఈ ఏడాది ఆ సంఖ్య 30.37 లక్షల కేసులకు చేరింది. దీంతో బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. ఇక IMFL విక్రయాలు గత ఏడాది 14.16 లక్షల కేసులుగా ఉండగా, ఈసారి 18.38 లక్షల కేసులకు పెరిగాయి. అక్టోబర్ 19న రాష్ట్రంలో ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. పండుగ సీజన్ ప్రారంభంలో అమ్మకాలు నెమ్మదిగా సాగినా, రెండో వారం నుంచి వేగం పుంజుకున్నాయి. అక్టోబర్ 16 నాటికి మొత్తం విక్రయాల విలువ రూ.1,527.85 కోట్లుగా ఉండగా, మరో మూడు రోజుల్లోనే రూ.2,000 కోట్ల మార్కును దాటింది. అక్టోబర్ 19 వరకు నమోదైన గణాంకాల ఆధారంగానే ఈ వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

## తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు: మహేశ్ గౌడ్



తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు. బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.

## ఇండియా కూటమి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం



కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి కలిసి దేశవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తూ, నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. న్యాయస్థానాలు, రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా వారి చర్యలు ఉన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ ప్రయోజనాల కంటే అధికారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. నిరసనల ముసుగులో చట్టాలను ఉల్లంఘించడం, నిరాధార ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, అశాంతి సృష్టించేందుకు విదేశీ నిధులు కూడా వస్తున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టత ఇచ్చిందని, ఎలాంటి ఆధారాలు లేకుండా లక్షలాది మంది ఓటర్లను జాబితాలో చేర్చాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చేలా యాత్రలు నిర్వహించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. ఇండియా కూటమి అసత్య కథనాలను తిప్పికొట్టేందుకు బీజేపీ దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు లక్ష్మణ్ ప్రకటించారు. అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన నగరాల్లో బహిరంగ సభలు, మేధావులు-విద్యావంతులతో చర్చాగోష్టులు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 మందితో సమావేశాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. దేశ భద్రత, అర్హులైన ఓటర్ల హక్కుల విషయంలో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణతో పాటు జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియ, ప్రతిపక్షాల నిరసనలపై రాజకీయ వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో లక్ష్మణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు ప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణ, ఎన్నికల సమగ్రత గురించిన ఆందోళనలను తెలియజేయడానికే తమ చర్యలని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

స్పందన
తెలుగు దినపత్రిక

# ధర్మ పరిరక్షణ మనందరి ధ్యేయం





**- హిందూ ధర్మానికి విఘాతం కలిగించే శక్తులకు తగిన బుద్ధి చెప్పాలి**

**- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు**

**జిన్నారం, అక్టోబర్ 21 (స్పందన):**



హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ధర్మాన్ని కాపాడుకోవడమే మనందరి ధ్యేయమని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. జిన్నారం మండల కేంద్రంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన అమ్మవారి శోభాయాత్రలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. భక్తుల జయజయధ్వానాలు.. డప్పుల దరువులు.. కళాకారుల నృత్యాలు.. పోతరాజుల విన్యాసాల నడుమ జిన్నారం గ్రామంలో శ్రీ దుర్గాదేవి శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పది రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను ఉపేక్షించకుండా, ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలబడి తగిన విధంగా స్పందించాలని పిలుపునిచ్చారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి శోభాయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. శోభాయాత్రలో డప్పుల మోతలు, కళాకారుల నృత్యాలు, పోతరాజుల చిందులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు, యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులన్నీ భక్తులతో కిటకిటలాడగా, జిన్నారం అంతటా పండుగ వాతావరణం నెలకొంది. యువత ఉత్సాహం, గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్సీ చిన్నమయల్ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్,
జిన్నారం వైస్ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్లు దీన ప్రవీణ్, స్వప్న రాజేందర్ రెడ్డి, బేగరి వెంకటేష్, స్థానిక సీఐ నాగార్జున గౌడ్, నాయకులు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# చాముండేశ్వరి మాతను దర్శించుకున్న బిజిలిపూర్ కాంగ్రెస్ నాయకులు

**తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు**

**వట్పల్లి, అక్టోబర్ 21 (స్పందన ):**

వట్పల్లి మండలం బిజిలిపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చాముండేశ్వరి మాతను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుని, రాష్ట్రంలో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని ప్రార్థించారు. రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని, యువతకు ఉపాధి అవకాశాలు లభించాలని, గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. "ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి.. ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి.. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలి"అని నాయకులు ఆకాంక్షించారు. భక్తి, విశ్వాసం, ప్రజల సంక్షేమం అనే ఆశయాలతో చాముండేశ్వరి మాతను దర్శించుకోవడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఇ యొక్క కార్యక్రమం లో అరవింద్, అనిల్, సంగమేష్, మల్లన్న, విజయ్, శంకర్, అనిల్, సాయి, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు

# మరవెల్లిలో ఘనంగా దసరా వేడుకలు









**డప్పు చప్పుళ్ల మధ్య జమ్మిచెట్టుకు పూజలు.. అలాయ్ బలాయ్‌తో ఆత్మీయ పలకరింపులు**

**వట్పల్లి, అక్టోబర్ 21 (స్పందన ):**

వట్పల్లి మండలం మరవెల్లి గ్రామంలో విజయదశమి దసరా పండుగను గ్రామస్థులు సంప్రదాయబద్ధంగా, ఘనంగా జరుపుకున్నారు. ఏటా వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు కలిసి డప్పు చప్పుళ్ల నడుమ ఉత్సాహంగా పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులతో కలిసి డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా గ్రామ చివరన ఉన్న జమ్మిచెట్టు వద్దకు చేరుకున్నారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయం ప్రకారం జమ్మి ఆకులను తెంపుకున్నారు. విజయానికి, శుభానికి ప్రతీకగా భావించే జమ్మి ఆకులను పరస్పరం పంచుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం తిరిగి అదే డప్పు చప్పుళ్ల మధ్య గ్రామంలోకి చేరుకున్న గ్రామస్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరిస్తూ అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఆత్మీయతను పంచుకుంటూ, సోదరభావం మరియు ఐక్యతను చాటుకున్నారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దసరా వేడుకలు మరవెల్లిలో పండుగ వాతావరణాన్ని నింపాయి. పాతతరం నుంచి వస్తున్న ఆచారాలను నేటి యువత కూడా కొనసాగించడం విశేషం. గ్రామస్థులందరూ కలిసిమెలిసి పండుగను జరుపుకోవడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న హైదరాబాద్ కాంగ్రెస్ నేతల దసరా సందడి

**జహీరాబాద్, అక్టోబర్ 21 (స్పందన) :**





విజయదశమి పండుగను పురస్కరించుకుని చిన్న హైదరాబాద్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జహీరాబాద్‌లో నిర్వహించిన అలయ్--బలయ్ కార్యక్రమంలో పాల్గొని పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు. గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బి. ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు పట్టణానికి చేరుకుని పలువురు ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్, తెలంగాణ సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ సిద్ధం ఉజ్వల్‌రెడ్డిలను వారి కార్యాలయాల్లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. పండుగ వాతావరణంలో నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు కలుసుకోవడంతో సందడి నెలకొంది. గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ బి. ప్రతాప్‌రెడ్డి కార్యక్రమంలో ముందుండి నడిపించారు. ఈ కార్యక్రమంలో మన్నూరు కృష్ణారెడ్డి, మున్నూరు వినోద్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎక్కలి సంజీవ్, ఎండీ గౌసు, తొమ్మలపల్లి శివన్న, ప్రభు, నర్సింహులు, శంకరప్ప, జగన్‌రెడ్డి, రాములు, యాదప్ప, రవి, నజ్జుతో పాటు చిన్న హైదరాబాద్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీమ్ఇండియాకు కివీస్ పరీక్ష

## నేటి నుంచే టీ20 సిరీస్




**క్రైస్ట్‌చర్చ్ :** కొంత విరామం తర్వాత టీమ్ఇండియా విదేశీ సిరీస్‌కు సిద్ధమైంది. సుదీర్ఘంగా సాగే న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా ముందు టీ20ల్లో తలపడబోతోంది భారత్. గురువారమే తొలి టీ20. శ్రేయస్ సారథ్యంలోని భారత జట్టుకు ఈ సిరీస్ సవాల్ అనడంలో సందేహం లేదు. అతను కెప్టెన్ అయ్యాక ఆడిన తొలి రెండు సిరీస్‌ల్లో భారత్‌కు షాకులు తప్పలేదు. ఐర్లాండ్, ఇంగ్లాండ్ జట్ల చేతుల్లో పరాజయాలు ఎదురయ్యాయి. తర్వాత బలహీన జట్లపై విజయాలు సాధించినప్పటికీ.. ఇటీవల సొంతగడ్డపై విండీస్ నుంచి గట్టి ప్రతిఘటనే ఎదురైంది. ఆ సిరీస్‌ను 2–2తో ముగించిన శ్రేయస్ సేనకు.. కివీస్‌ను దాని సొంతగడ్డపై ఓడించడం తేలిక కాదు. మిచెల్ శాంట్నర్ సారథ్యంలోని న్యూజిలాండ్ జట్టులో ఫిన్ అలన్, టిమ్ సీఫర్ట్, గ్లెన్ ఫిలిప్స్ లాంటి విధ్వంసక బ్యాటర్లు.. కాన్వే, మిచెల్ లాంటి క్లాస్ ఆటగాళ్లు ఉన్నారు. కెప్టెన్ శాంట్నర్‌తో పాటు బ్రాస్‌వెల్ స్పిన్ బౌలింగ్‌తోనే కాక బ్యాటుతోనూ సత్తా చాటగలరు. హెన్రీ, ఫెర్గూసన్, జేమీసన్, నాథన్ స్మిత్‌లతో పేస్ విభాగమూ బాగుంది. బరిలో భువి: నాలుగేళ్ల విరామం తర్వాత భారత జట్టులో చోటు దక్కించుకున్న సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ ఈ మ్యాచ్‌కు ప్రధాన ఆకర్షణ కానున్నాడు. ఇక మళ్లీ భారత జట్టులో చూడలేమనుకున్న భువి.. ఐపీఎల్, దేశవాళీల్లో నిలకడగా రాణించి పునరాగమనం చేశాడు. కివీస్‌తో తొలి టీ20కి అతడిని తుది జట్టులో చూడబోతున్నాం. తన స్వింగ్ బౌలింగ్‌కు నప్పే న్యూజిలాండ్ వికెట్లపై అతను విజృంభిస్తాడని జట్టు ఆశిస్తోంది. అర్ష్‌దీప్ సింగ్ అతడితో కొత్త బంతిని పంచుకుంటాడు. ప్రిన్స్ యాదవ్ మూడో పేసర్‌గా తుది జట్టులో ఉండొచ్చు. పేస్ ఆల్‌రౌండర్లు శివమ్ దూబె, నితీశ్‌కుమార్‌లను అందుబాటులో ఉన్న నేపథ్యంలో ప్రిన్స్ బదులు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని తుది జట్టులో ఆడించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేం. ప్రధాన స్పిన్నర్ అక్షర్ పటేల్.. కివీస్ విధ్వంసక బ్యాటర్లకు ఎలా కళ్లెం వేస్తాడో చూడాలి. బ్యాటింగ్‌లో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కకపోవచ్చు. అభిషేక్‌తో కలిసి సంజు శాంసనే ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. వీళ్లిద్దరికీ తోడు ఇషాన్, శ్రేయస్, తిలక్, దూబె, నితీశ్‌లతో భారత బ్యాటింగ్ విభాగం బలంగానే కనిపిస్తోంది. అయితే ఇటీవలే సొంతగడ్డపై సిరీస్ ఆడడం, ప్రయాణానంతరం ఎక్కువ విరామం లేకుండా తొలి టీ20 ఆడాల్సి ఉండడంతో భారత జట్టు స్థాయికి తగ్గటు ఆడగలదా అన్నది ప్రశ్న. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు. పిచ్ బ్యాటింగ్, పేస్‌కు సహకరిస్తుందని అంచనా.

**తుది జట్లు (అంచనా)..**

**భారత్:** అభిషేక్, శాంసన్, ఇషాన్, శ్రేయస్ (కెప్టెన్), తిలక్, దూబె, నితీశ్, అక్షర్, భువనేశ్వర్, ప్రిన్స్ యాదవ్/వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్;
**న్యూజిలాండ్:** అలెన్, సీఫర్ట్, కాన్వే, గ్లెన్ ఫిలిప్స్, మిచెల్, బ్రాస్‌వెల్, శాంట్నర్ (కెప్టెన్), నాథన్ స్మిత్, జేమీసన్, హెన్రీ, ఫెర్గూసన్.




# నష్టాల్లో ముగిసిన సూచీలు..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. ఉదయం లాభాల్లో కదలాడిన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఐటీ, ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్లు లాభపడింది. గరిష్ఠాల నుంచి 1300 పాయింట్లు క్షీణించి ఇంట్రాడే కనిష్ఠాలను తాకింది. చివరికి గరిష్ఠాలతో పోలిస్తే 1000 పాయింట్లు క్షీణించి స్వల్ప నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 74,337.93 (క్రితం ముగింపు 73,852.90) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 74,682.19 వద్ద గరిష్ఠాన్ని తాకింది. తర్వాత క్రమంగా నష్టాల్లోకి వెళ్లిన సూచీ.. 73,229.45 వద్ద కనిష్ఠాన్ని చేరుకుంది. ఆఖర్లో కాస్త కోలుకుని 143.21 పాయింట్ల నష్టంతో 73,709.69 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 77.60 పాయింట్ల నష్టంతో 22,811 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.45గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 110 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 4,115 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# ఆ విషయంలో ఇప్పటికీ సందేహమే!



## ఆసక్తికర విషయాలు వెల్లడించిన మమితా బైజు!

ఈ ఏడాది వరుస హిట్ సినిమాలతో జోరు మీదున్నారు మలయాళ కథానాయిక మమితా బైజు. ప్రస్తుతం అగ్ర కథానాయకుల సరసన నటిస్తూ ఆఫర్లు అందుకుంటున్న ఈమె, 'బెల్లెహోం కుటుంబ యూనిట్' చిత్రం గురించి ఇటీవలే ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మమితా మాట్లాడుతూ.. "సూపర్ శరణ్య సినిమా షూటింగ్ అప్పుడే ముగిసింది. ఇంకా ఆ సినిమా విడుదల కూడా కాకముందే దర్శకుడు గిరీశ్ నాకు బెల్లెహోమ్ కుటుంబ యూనిట్ కథ చెప్పారు. ఆ సినిమాలో ఉన్న ప్రత్యేక పాత్రను నేను చేస్తేనే బాగుంటుందని ఆయన అన్నారు. అయితే ఆయన నాతో ఎందుకలా అన్నారో, నన్ను నమ్మడానికి ఆయనకు అంత ధైర్యం ఎలా వచ్చిందో నాకు ఇప్పటికీ తెలియదు. ఈ విషయంలో నాకు ఇప్పటికీ పెద్ద సందేహంగానే ఉంది" అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంతేకాకుండా.. "ప్రధాన కథానాయిక పాత్రను నేను పూర్తి స్థాయిలో చేయగలనని నేను కూడా నమ్మని సమయంలో దర్శకుడు గిరీశ్ నాపై ఎంతగానో నమ్మకం ఉంచారు. 'ప్రేమలు', 'బెల్లెహోమ్ కుటుంబ యూనిట్' చిత్రాల్లో నాకు మంచి అవకాశాలు ఇచ్చినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు" అని మమితా బైజు కృతజ్ఞతలు చెప్పుకొచ్చారు.






# ఏంటి మౌళి.. పబ్లిక్‌గా టిఫిన్ చేసేస్తున్నావ్..!

## 'దొంగ నా కొడుకు' టీజర్ విడుదల!

యూట్యూబర్‌గా విశేష ప్రజాదరణ పొంది, 'లిటిల్ హార్ట్స్' చిత్రంతో కథానాయకుడిగా మారి భారీ విజయాన్ని అందుకున్న యువ నటుడు మౌళి ప్రధాన పాత్రలో తెరకెక్కిన తాజా చిత్రం 'దొంగ నా కొడుకు'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి శ్రీను కంబాల దర్శకత్వం వహిస్తున్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. పూర్తిస్థాయి క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వైజాగ్ నేపథ్యంలో సాగే ఈ కథలో మౌళి 'ఈశ్వర్' అనే యువకుడి పాత్రలో కనిపించనున్నాడు. ఏ పనీపాట లేకుండా ఖాళీగా తిరిగే ఈశ్వర్‌కు ఇంట్లో కూడా ఎలాంటి గౌరవం దక్కదు. అలాంటి ఈశ్వర్ జీవితంలోకి ఒక గర్ల్‌ఫ్రెండ్ రావడంతో కథ ఆసక్తికర మలుపు తిరుగుతుంది. ఊహించని విధంగా అతడి చేతికి భారీగా డబ్బు రావడం, ఆ తర్వాత ఎదురైన విచిత్ర పరిస్థితులు, సమస్యల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. ఈ టీజర్‌లో మౌళి తనదైన బాడీ లాంగ్వేజ్, ఫన్నీ మేనరిజమ్స్, టైమింగ్ కామెడీతో నవ్వులు పూయించాడు. 'దొంగ నా కొడుకు' అనే టైటిల్‌కు పూర్తి న్యాయం చేస్తూ క్రైమ్, కామెడీ అంశాలను దర్శకుడు శ్రీను కంబాల చక్కగా మేళవించినట్లు కనిపిస్తోంది. ఈ చిత్రంలో మౌళికి జోడీగా సుస్మితా శెట్టి నటిస్తుండగా, సీనియర్ నటులు అలీ, రఘుబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎంతో ఉత్సాహాన్ని నింపిన ఈ 'దొంగ నా కొడుకు' చిత్రం వచ్చే నెల 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# రెండో ఇన్నింగ్స్‌లో వైపు

## రూటు మార్చిన 'కాజల్ అగర్వాల్..



టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోల సరసన వరుస బ్లాక్‌బస్టర్లతో అగ్ర కథానాయికగా చక్రం తిప్పిన 'చందమామ' కాజల్ అగర్వాల్, తన కెరీర్ రెండో ఇన్నింగ్స్‌లో సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. వివాహం, మాతృత్వం తర్వాత వెండితెరకు కొంతకాలం విరామం ఇచ్చిన ఈ సౌత్ బ్యూటీ, రీఎంట్రీలో మాత్రం కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథానాయికగా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో అలరించిన కాజల్, సెకండ్ ఇన్నింగ్స్‌లో కంటెంట్ ఆధారిత సినిమాలకు, లేడీ ఓరియెంటెడ్ ప్రాజెక్టులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. 'సత్యభామ' వంటి యాక్షన్ థ్రిల్లర్ చిత్రాల్లో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషించి నటనకు ప్రాధాన్యం ఉన్న రోల్స్ చేయగలనని నిరూపించుకున్నారు. రెగ్యులర్ హీరోయిన్ పాత్రల కంటే నటిగా గుర్తింపు తెచ్చే వైవిధ్యమైన కథలనే ఎంచుకుంటూ పయనిస్తున్నారు. కేవలం ఒక్క భాషకే పరిమితం కాకుండా పాన్-ఇండియా స్థాయిలో కూడా కాజల్ తన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'తో పాటు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న 'రామాయణం' చిత్రంలో మండోదరిగా కీలక పాత్ర పోషిస్తూ నేషనల్ వైడ్‌గా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, బాలీవుడ్ ప్రాజెక్టులపై కూడా దృష్టి సారిస్తూ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ఎంతో ప్లాన్డ్‌గా కొనసాగిస్తున్నారు.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780